నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 23 అక్టోబర్ 2024 | SURYAPET

భువనగిరి ట్రిపుల్ ఆర్ త్రీజీ నోటిఫికేషన్ విడుదల

- 25 నుంచి ఆర్డీఓ కార్యాలయంలో రైతులతో సమావేశాలు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : రీజనల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్)లో భాగంగా భువనగిరి పరిధిలో త్రీజీ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ బహిరంగ ప్రకటన రిలీజ్ చేసింది. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నారు. దీని పరిధిలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. సుమారు 2వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందులో భాగంగా భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, కేసారం, యెర్రంబెల్లి, తుక్కాపూర్, పెంచికల్‌పహాడ్, రాయగిరి గ్రామాల్లో భూమిని తీసుకోనున్నారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. భువనగిరి పరిధిలో కొంత కాలంగా హైకోర్టు స్టే ఉండడంతో భూ సేకరణ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఇటీవల హైకోర్టు స్టేను ఎత్తేయడంతో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. త్రీజీ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులతో ఈ నెల 25 నుంచి 30 వరకు భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించనున్నారు. కాగా త్రీజీ నోటిఫికేషన్ గందరగోళంగా ఉందని భూ నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ఎవరెవరు భూములు కోల్పోతున్నారో పొందుపర్చకుండా, సర్వే నంబర్లలోని అందరి వివరాలు జత చేశారని చెప్పుకొస్తున్నారు.



భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ శ్రేణులు

రగులుతున్న రామన్నపేట

అంబుజా సిమెంట్ పరిశ్రమపై తీవ్ర వ్యతిరేకత

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

గ్రామాలకు గ్రామాలుగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు

ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని అఖిలపక్షం పిలుపు

నేడు రామన్నపేట స్వచ్ఛంద బంద్

రామన్నపేట, అక్టోబర్ 22 : రామన్నపేటలో అదానీ గ్రూపు ఏర్పాటు చేయాలని చూస్తున్న అంబుజా సిమెంట్ కర్మాగారంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అంగ బలం, అర్థ బలంతో పరిశ్రమను తీసుకొచ్చి తమ నెత్తిన కాలుష్య కుంపటిని పెడుతామంటే ఊరుకునేది లేదని రామన్నపేట మండల ప్రజానీకం తేల్చి చెబుతున్నది. ఇక్కడి పర్యావరణాన్ని, జనజీవనాన్ని ఫణంగా పెట్టి కొర్పొరేట్‌కు రెడ్ కార్పెట్ వేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేస్తున్నది. ఈ మేరకు కొద్ది రోజుల నుంచి నిర్విరామంగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. గ్రామ గ్రామాన నిరసనలు వెల్లువెత్తాయి. పాఠశాల విద్యార్థులను నుంచి సబ్బండ వర్గాల ప్రజలు ఈ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నారు. ఈ క్రమంలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణను అధికారులు ఏర్పాటు చేయగా, సమావేశానికి హాజరై ఫ్యాక్టరీ వద్దని చెప్పేందుకు మండలంలోని దాదాపు అన్ని గ్రామ ప్రజలు సిద్ధమవుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాటు చేసిన షామియా

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

అదానీ గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై పరిశ్రమ ప్రతిపాదిత ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. షామియానాలు, కుర్చీలు వేశారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలం చదును చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చే ప్రజలు ఒకే మార్గంలో వచ్చి వెళ్లే విధంగా చేసి మిగతా రోడ్లను ట్రెంచ్ చేశారు. అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ముక్త కంఠంతో వ్యతిరేకించాలని అఖిల పక్షం పిలుపు

అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై జరిగే ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని అఖిల పక్షం నాయకులు పిలుపు నిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఒక్కటై కాలుష్య పరిశ్రమను అడ్డుకోవాలని కోరుతున్నారు. పరిశ్రమ ఏర్పాటు మూలంగా రామన్నపేట మండల ప్రజల భవిషత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కన్న తల్లి వంటి పల్లెలను కాలుష్య కాసారం నుంచి కాపాడుకుందామంటున్నారు. మరోవైపు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ అఖిల పక్షం బుధవారం రామన్నపేట బంద్‌కు పిలుపునిచ్చారు. దాంతో వ్యాపారులు, విద్యాసంస్థలు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాల్గొని మద్దతు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

రామన్నపేట మండల రెవెన్యూ పరిధిలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం గ్రామాల పరిధిలో సుమారు 300 ఎకరాల భూమిని డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్క్ పేరుతో అదానీ కంపెనీ రైతుల నుంచి కొనుగోలు చేసింది. అందులో 66 ఎకరాల్లో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని, ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ప్రకటన వెలువడడంతో ప్రజలు భయాందోళనలో పడ్డారు. డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్కుతో రామన్నపేట మండలానికి మేలు జరుగుతుందని, యువకులు, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని సంతోషంగా ఉన్న ప్రజల్లో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న వార్త పిడుగులా పడింది. దాంతో ఎక్కడ నలుగురు కలిసినా ఇదే చర్చ కొనసాగుతున్నది. ఇప్పటికే మూసీ కాలుష్య జలాలతో ప్రజలు, రైతులు అల్లాడుతున్నారు. పంటలు సరిగ్గా పండడం లేదు. ఇది చాలదన్నట్లు ఇప్పుడు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామనడంతో రైతుల వెన్నులో వణుకు మొదలైంది. గీత, నేత, మత్స్యకారులతోపాటు వివిధ వృత్తిదారులు, యువకులు, విద్యార్థులు, అఖిల పక్ష నాయకులు పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. మెయిల్స్ పంపారు. అవగాహన సదస్సుల్లో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరిచారు. అదానీ కంపెనీ పొందుపరిచిన నివేదికలో 10 కిలో మీటర్ల మేర సిమెంట్ కంపెనీ ప్రభావం ఉంటుందని తెలుపడడంతో రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం, వెల్లంకి, సర్నేనిగూడెం, నీర్నెంముల, లక్ష్మాపురం, బోగారం, నిదానపల్లి, తుమ్మలగూడెం, జనంపల్లి, ఇస్కిళ్ల, పల్లివాడ, ఉత్తటూరుతోపాటు చిట్యాల మండలంలోని చిట్యాల, పెద్దకాపర్తి, వెలిమినేడు, శివనేనిగూడెం గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

- అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వద్దు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 22 : అదానీ గ్రూప్ ధనదాహంతో రామన్నపేటలో కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమను ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతామంటే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రామన్నపేటలో అంబూజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ఎలా అయితే ఉద్యమం చేశామో.. అంబుజా కంపెనీ, రేవంత్‌రెడ్డిపై అదే మాదిరి తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యమాని పల్లెలు ఇప్పుడిప్పుడే ఆర్థిక పరిపుష్టితో ఉన్నాయని, భూములు మంచి ధర పలుకుతున్నాయని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే భూముల ధరలు అమాంతం పడిపోయే ప్రమాదం ఉందని, ఇక్కడ ప్రజల జీవనం చిన్నాభిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే రామన్నపేట, వలిగొండ, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లోని అనేక గ్రామాలు కాలుష్యంతో విలవిల్లాడుతాయన్నారు. వెనకబడ్డ ప్రాంతాల్లో వ్యవసాయం, కుల వృత్తులపై ఆధారపడి జీవించే రైతులు, నేత, గీత కార్మికులు, యాదవులు, ఇతర వృత్తిదారులు ఉపాధి కోల్పోతారని పేర్కొన్నారు. ప్రధానంగా రామన్నపేట, సిరిపురం, ఎల్లంకి, కొమ్మాయిగూడెం, పెద్దకాపర్తి తదితర 9 గ్రామాల ప్రజలు వలసలు పోక తప్పని పరిస్థితులు నెలకొంటాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, రైతులు సంతోషంగా ఉండడం కాంగ్రెస్ ప్రభుత్వానికి నచ్చడం లేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్లు పెంట నర్సింహ, ఎన్నబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ భువనగిరి పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు బక్క మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్‌బాబు, సాల్వేర్ అశోక్, గొరిగి నరసింహ, పున్న వెంకటేశం, ఎండీ ఆమీర్, నాయకులు కన్నెబోయిన బలరాం, కోళ్ల స్వామి, మెట్టు మహేందర్‌రెడ్డి, యాదయ్య, ఎస్‌కే చాంద్, జాడ సంతోశ్, కూనూరు ముత్తయ్య, జంగిలి నరసింహ, మిర్యాల మల్లేశం, బాలగోని శివ, లవణం రాము, రామిని లక్ష్మణ్, కోనూరు శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, ఆవుల నరేందర్, ఆవుల శ్రీధర్, నక్క నరేందర్, ఎడ్ల నరేందర్‌రెడ్డి, జాడ అమరేందర్ రెడ్డి, పున్న వెంకటేశం, బుర్ర శ్రీశైలం, గుండు రమేశ్, కన్నెబోయిన వెంకటేశం, మోటి రవీందర్, కల్లూరి నరేశ్, బాసాని రాజు, ఆజాద్, సైదులు, మహేష్, వెంకన్న పాల్గొన్నారు.

రేపు సూర్యాపేటకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక

- కలెక్టరేట్‌లో కవులు, కళాకారులతో పరిచయ కార్యక్రమం
- శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలుసుకునే అవకాశం
- అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం

గవర్నర్ పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 22 : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సూర్యాపేటకు రానున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో గవర్నర్ పర్యటనపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 10.30 గంటలకు గవర్నర్ సూర్యాపేట కలెక్టరేట్‌కు చేరుకుంటారని తెలిపారు. 11.30 గంటలకు వరకు జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని, అనంతరం శాఖల వారీగా లక్ష్యాలను వివరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

11.30 గంటల నుంచి 12.30 గంటలకు జిల్లాలోని కవులు, కళాకారులతో పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పర్యాటక వివరాలను తెలిపేలా 5 స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ అప్పారావు, డీఈఓ అశోక్, డీయంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వద్దు

వెల్లంకి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

అఖిలపక్షం ఆధ్వర్యంలో వెల్లంకి గ్రామస్తుల ర్యాలీ

రామన్నపేట, అక్టోబర్ 22 : రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దని వెల్లంకి గ్రామస్తులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎడ్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్న కాలుష్యంతో జన జీవనానికి ప్రమాదం వాటిల్లుతుందన్నారు. మండల ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని కంపెనీని ఏర్పాటును వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎడ్ల నరేందర్‌రెడ్డి, పున్న వెంకటేశం, ఈడెం శ్రీనివాస్, ఎడ్ల మల్లారెడ్డి, పిట్ట మహేందర్ పాల్గొన్నారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ జనంపల్లి గ్రామ అఖిల పక్ష నాయకులు తాసీల్దాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, పులి భిక్షం ఉన్నారు.

కాంగ్రెస్‌లో కుమ్ములాట

తుంగతుర్తిలో కొట్లాట వరకూ వెళ్లిన వర్గపోరు

అర్వపల్లి, అక్టోబర్ 22 : తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గ పోరు చిలికి చిలికి దాడుల వరకూ వెళ్లింది. జాజిరెడ్డిగూడేనికి చెందిన కాంగ్రెస్ నేత గుడిపల్లి మధుకర్‌రెడ్డి ఇటీవల ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సన్నిహితంగా ఉంటూ రాజకీయంగా మండలంలో చక్రం తిప్పుతున్నాడు. ఇది జీర్ణించుకోలేని అదే పార్టీలోని ప్రత్యర్థి వర్గం నాయకులు సోమవారం రాత్రి కార్లలో వచ్చి మధుకర్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారు. పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. స్టేషన్‌కు వెళ్లిన సమయంలోనూ కొట్టుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇరువర్గాలు మంగళవారం వేరువేరుగా విలేకరుల సమావేశం నిర్వహించాయి. రెండ్రోజుల క్రితం జాజిరెడ్డిగూడెంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు వచ్చిన ఎమ్మెల్యే సామేల్‌కు వందల సంఖ్యలో బైక్ ర్యాలీగా వెళ్లి స్వాగతం పలుకడం జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోరపాక సత్యం, ఆయన అనుచరులు తనపై దాడికి దిగారని గుడిపల్లి మధుకర్ రెడ్డి ఆరోపించారు. ఇలాంటివి పునారావృతం వాళ్లను మండలంలో అడుగు పెట్టనీయమని హెచ్చరించారు. మరో సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచారి మాట్లాడుతూ జాజిరెడ్డిగూడేనికి చెందిన మధుకర్‌రెడ్డి అనుచరులు మొరపాక సత్యంపై దాడి చేయడం, కారును ధ్వంసం చేయడం అనైతికమన్నారు. అసలైన కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా సోషల్ మీడియాలో ఎందుకు పోస్టులు షేర్ చేశారని ఫోన్లో ప్రశ్నించగా..

మండలాధ్యక్షుడిని మాట్లాడుకుందాం రమ్మనందుకు డ్రైవర్‌తో కలిసి వెళ్తే మధుకర్‌రెడ్డి అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. అనంతరం వాళ్లే తమపై కేసు పెట్టారని పేర్కొన్నారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీస్పీ రవి, సీఐ రఘువీర్‌రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీస్.. అలర్ట్.. అలర్ట్!

- పోలీస్ చెకింగ్‌లో దొరుకకుండా వాట్సాప్ గ్రూపులు
- రూట్ల వారీగా గ్రూప్‌లు.. అప్పటికప్పుడు అప్‌డేట్స్

నల్లగొండ, అక్టోబర్ 22 : ఏనీ పోలీస్ చెకింగ్! అంటూ.. ఇంట్లో నుంచి బయటకు వెళ్లే ముందు సతీశ్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. నరేశ్ అనే మరో యువకుడు రిప్లై ఇస్తూ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ట్రాఫిక్ పోలీసులు చెకింగ్ చేస్తున్నారంటూ రిప్లై ఇచ్చాడు. సైదులు రెస్పాండ్ అవుతూ కనగల్ టు నల్లగొండ ఆల్ క్లియర్ అక్కడ. ఇంతలో శ్రీనివాస్‌రెడ్డి అనే మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి కలెక్టరేట్ వద్ద చెకింగ్ నడుస్తున్నదని మెసేజ్ చేశాడు. ఇదీ నల్లగొండలో వాట్సాప్ గ్రూప్ ఆధారంగా నడుస్తున్న తంతంగం. జిల్లా కేంద్రంలో రూరల్, వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లు ఉండగా.. పోలీసులు వాహన తనిఖీల సమయంలో నిబంధనలు పాటించని వారికి చలాన్లు వేయడం, తాగి బండి నడిపితే కేసు పెట్టి జైలుకు పంపడం చేస్తున్నారు. దాంతో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వాహనదారులు తిప్పర్తి టు నల్లగొండ, కనగల్ టు నల్లగొండ, నకిరేకల్ టు నల్లగొండ, కట్టంగూర్ టు నల్లగొండ.. ఇలా ప్రాంతాల వారీగా ఆయా గ్రామాల ప్రజలతో వాట్సాప్ గ్రూప్స్ క్రియేట్ చేశారు. ఒక్కో గ్రామంలో ఇద్దరు, ముగ్గురిని అడ్మిన్‌గా పెట్టి ఆ గ్రూపుల్లో దాదాపు గ్రామస్తులను యాడ్ చేశారు. ప్రతి గ్రూప్‌లో కనీసం ఏడెనిమిది వందల మంది సభ్యులు ఉంటుండడం గమనార్హం. పోలీస్ చెకింగ్‌ను తప్పించుకునేందుకు ఇలాంటి పనులు చేస్తుండగా, దీన్ని అడ్డం పెట్టుకుని మద్యం తాగి వాహనాలపై రోడ్ల మీదకు వస్తే అమాయకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉంది.

సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఫీజు బకాయిల కోసం పోరుబాట

- కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు
- పెద్దఎత్తున తరలివచ్చి ఆందోళన

నల్లగొండ/సూర్యాపేట టౌన్, అక్టోబర్ 22 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్దఎత్తున కదంతొక్కారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీలు తీశారు. నల్లగొండ, యాదాద్రి కలెక్టరేట్లను ముట్టడించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నదని మండిపడ్డారు. స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు సొంత భవనాలు లేక సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలని, ఇంటర్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.1,500 నుంచి రూ.3వేలకు పెంచాలని కోరారు. బీసీల జనాభా ప్రకారం మరో 120 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 300 కళాశాలల హాస్టళ్లు మంజూరు చేసి స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘ నేతలు ధర్నా విరమించకపోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తర్వాత విడిచిపెట్టారు. ఆందోళనల్లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలగోని వెంకటేశ్ గౌడ్, రాజ్యాధికార సమితి అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేశ్ చారి, జిల్లా కార్యదర్శి పరల సాయికుమార్ పాల్గొన్నారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ ఆర్జాలబావి ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

పలుచోట్ల వర్షం

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నల్లగొండ, అక్టోబర్ 22 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అల్పపీడనం ప్రభావం కారణంగా వర్షం పడింది. సాయంత్రం వరకు వాతావరణంలో పెద్దగా మార్పులు లేకపోయినా ఆ తర్వాత మేఘాలు గర్జించాయి. వర్షంతో అక్కడక్కడా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. చిట్యాల మండలంలో అత్యధికంగా 32.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కట్టంగూర్‌లో 23.0, మునుగోడులో 22.8, నాంపల్లిలో 12.0, నల్లగొండలో 11.0, నార్కట్‌పల్లిలో 9.8, గుర్రంపోడులో 8.5, తిప్పర్తిలో 3.8, చండూరులో 1.8, గట్టుప్పల్‌లో 1.5, చింతపల్లిలో 1.3 మి.మీ. వర్షం పడింది.